# వయసొచ్చిన మనసు

అది ఉదయం పదిగంటల సమయం. ఆ వీధి మధ్యలోనున్న ఒక డాబా ఇంటి ముందు ఆటో ఆగింది. అందులోంచి నలభై అయిదేళ్ళ మధ్య వయస్కుడు, పాతికేళ్ళ యువకుడు దిగారు. వారిని చూడగానే ఇంటి యజమాని నారాయణరావు ముఖం విప్పారింది. మధ్యవయస్కుడు ఏదో మాట్లాడబోగా అందుకు అవకాశమివ్వకుండా "రండి...రండి" అంటూ లోనికి ఆహ్వానించాడు. ఆడపిల్లల తండ్రి కదా మరి!

కర్టెను వెనుక నుండి చూస్తున్న పధ్నాలుగేళ్ళ ఆరతి ఇంట్లోకి పరుగెత్తి విషయం చెప్పింది.

నారాయణరావు వాళ్ళని సోఫాలో ఆసీనుల్ని చేసింతర్వాత నారాయణరావు భార్య జానకమ్మ కర్టెన్ తొలగించుకుని హాల్లోకి వచ్చింది. "బాబూ! అంతా కులాసాయేనా" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

"అంతా బాగున్నారండీ" మొహమాటంగా అన్నాడు మధ్యవయస్కుడు. యువకుడు మాత్రం సిగ్గుపడుతూ ఏం మాట్లాడలేదు.

"అక్కయ్యా! బావ చాలా బాగున్నాడే" అంది ఆరతి లోపలి గదిలో అలంకరించుకున్న సుహర్లతతో.

"ఛ...పోవే...అప్పుడే బావయినట్లు" అంది కుర్చీలో కూర్చుని పుస్తకంలో సినిమా బొమ్మలు చూస్తున్న సుహర్లత.

ఆమె చేతిలోని పుస్తకం క్రింద పడేస్తూ "లేదు తల్లీ. మీ చెల్లాయి చెప్పినట్లు నీక్కాబోయే శ్రీవారు ఎర్రగా, బొద్దుగా, అందంగా

ఉన్నాడు. మరయితే పిసినారులలో అగ్రేశ్వరుడని మాత్రం చెప్పగలను అంది ఆమె స్నేహితురాలు భాను

"అంటే"

"గోవిందా ఇన్సూరెన్సు కార్పొరేషన్‌లో ఆఫీసరు ఉద్యోగం కదా. ఎంత టిప్ టాప్‌గా ఉండాలి. బి సి. కాలంనాటి వాడిలా సాదాబట్టలు వేసుకుని పెళ్ళిచూపుల కొచ్చాడు".

"అవునే బాపూజీ అన్నట్లు ప్రతి ఒక్కరూ సింపుల్ లివింగ్ అండ్ హై తింకింగ్ అలవరచుకోవాలి"

"అబ్బో అప్పుడే సపోర్టా?"

"అదేంకాదు. ఇలాంటి పెళ్ళిచూపులు ఎన్నయాయో ఇంకెన్నున్నాయో మధురంగా నవ్వింది సుహర్లత. ఆమెకి పెళ్ళిచూపులంటేనే అలర్జీగా ఉంది

"అమ్మాయ్ కాఫీలు పట్టుకురా" లోపలికొచ్చి పిలిచింది జానకమ్మ.

"నేను రాను. చెల్లిచేత పంపించండి"

"లతా పెళ్ళిచూపులంటే ఎందుకే నీకింత కోపం" మందలించింది తల్లి.

"బాగా టిఫిన్లు మెక్కేరు. ఇక వాళ్ళ ఎంజాయిమెంటు కోసం బొమ్మల ప్రదర్శన" విసుక్కుంటూ కాఫీలుంచిన ట్రే చేతుల్లోకి తీసుకుంది సుహర్లత.

"ఇతనే నీకు సరియైన జోడు. చూసిన తర్వాత అనుకున్న ఇలా. పందెం?"

"నోర్మూసుకోవే ముందు" చిరుకోపంతో స్నేహితురాలిని మంద లించి ముందుకు కదిలింది.

హాల్లోకి అడుగుపెట్టగానే పరకాయించి చూసింది. మనసులోనే హేండ్సమ్‌గా ఉన్నాడు అనుకుంది.

యువకుడు మాత్రం ఆమె వైపోసారి చూచి తలవంచుకున్నాడు.

"ఈమె మా పెద్దమ్మాయి సుహర్లత" పరిచయం చేసాడు నారా యణరావు. యువకుడు మరొకసారి చూసాడు. అతనినే చూస్తున్న సుహర్లత చప్పున తలవంచుకుంది.

అప్పటివరకు అక్కడి అతిధి సత్కారాలకు ఆశ్చర్యపోతున్న ఆ ఇద్దరికీ సుహర్లత ప్రత్యేకమైన అలంకారాలు చూడగానే పూర్తిగా అర్ధమై ముచ్చెమటలు పోసాయి. అవతలి వారేం మాట్లాడుతున్నా వీళ్ళు అర్ధం చేసుకునే పరిస్థితిలో లేరు.

"సార్ మీతో కొద్దిగా మాట్లాడాలి. ఇలా వస్తారా" బయటికి పిలి చాడు మధ్య వయస్కుడు.

నారాయణరావు బయటికి నడిచాడు. వారిద్దరితోబాటు యువకుడు లేచి వెళ్ళాడు.

వరండాలోకి వచ్చిన మధ్యవయస్కుడు "నాపేరు నరహరి అండి. వీడు నా బావమరిది మాధవ్" అంటూ తామువచ్చిన పని చెప్పాడు. నర హరి మాటలు విని నారాయణరావు స్టన్ అయ్యాడు. తరువాత తన కుమార్తె పెళ్ళిచూపుల విషయం యావత్తూ చెప్పాడు.

"అరరే...ఎంతపని జరిగింది ఇప్పుడెలా?" బాధపడుతూ అన్నాడు నరహరి. మాధవ్ ముఖం నల్లగా మాడిపోయింది.

"ఇందులో ఎవరి పొరపాటూలేదు. అందరం ఎవరి ధోరణిలో వాళ్ళమున్నాం. నా స్నేహితుడి తరపున వచ్చినందుకు నాకెంతో ఆనందంగా ఉంది. మీరు ఇంట్లో కూర్చోండి" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు నారాయణరావు. నరహరి, మాధవ్ మౌనంగా ఉండిపోయారు.

"వాళ్ళొచ్చి వెళ్ళేంతవరకు నాకు తీరిక ఉండకపోవచ్చు. వాళ్ళు వెళ్ళేంతరువాత మనం తీరిగ్గా మాట్లాడుకుందాం. ముందు ఫలహారాలు హోటల్లోంచి తెప్పించాలి" అంటూ హడావుడిగా లోపలికి వెళ్ళాడు నారాయణరావు.

నరహరికి, మాధవ్‌కి ఇక అక్కడ ఉండబుద్ధి పుట్టక నెమ్మదిగా మెయిన్ బజారు వైపు నడక సాగించారు.

పెళ్ళి సంబంధం తెచ్చిన రామనాథశాస్త్రి తనకేదో అర్జంటు పనుందని, తాను రాలేనని అబ్బాయి, అతని తరపున ఇంకొకరు ఆరోజు ఉదయాన్నే వస్తారని, తాను లేకపోయినా కార్యం నిర్విఘ్నంగా జరిపించమని చెప్పి వెళ్ళిపోయాడు. అయితే వ్యక్తులు కొత్తవారు కావడంతో నారాయణరావు ఇబ్బందిలో పడ్డాడు.

"పొరపాటు జరిగింది జానకి. వీళ్ళు పెళ్ళిచూపులకు వచ్చిన వాళ్ళు కాదు. నా స్నేహితుని తరపు వాళ్ళు. అసలు వాళ్ళు ఇంకా రాలేదు"

అంతవరకు తన కుమార్తె వాళ్ళకి నచ్చి వుంటుందని, తన భర్తను బయటకు తీసుకువెళ్ళింది కట్నాలు, లాంఛనాలు మాట్లాడటానికయ్యుంటుందని భావించిన ఆమె దుఃఖం చెప్పనలవికాదు.

సుహర్లత ఏమీ బాధపడకపోయినా తల్లిదండ్రుల శ్రమ చూసి విచారించింది.

"బాధపడకమ్మా. వచ్చేవాళ్ళకు కాఫీలు ఇస్తే సరిపోతుంది. ఎందుకు లేనిపోని ఆర్భాటాలు" అంది.

"నీకు తెలియదు నువ్వూరుకోవే" అంటూ కూతుర్ని మందలించి తన పనుల్లో తాను మునిగిపోయింది జానకమ్మ.

ఇంతలో "టెలిగ్రాం" అని కేక వినిపించడంతో నారాయణరావు వీధిలోకి వెళ్ళాడు. టెలిగ్రాం అందుకుని చించాడు.

'అనివార్య కారణాల వల్ల తాము ఈ రోజు రావడం లేదని, వారం రోజుల్లో మంచి రోజు నిర్ణయించుకుని రామనాథశాస్త్రితో పాటు తాము రాగలమని' పెళ్ళివారు పంపిన వార్తమానమది.

నారాయణరావు గుండెల నిండుగా గాలి పీల్చుకుని భార్యకు, పిల్లలకు ఈ విషయం చెప్పాడు.

అప్పుడు గుర్తొచ్చింది నారాయణరావుకు, నరహరి, మాధవ్‌ల విషయం "జానకి రాకరాక వచ్చారు నా స్నేహితుని కుమారుడు అతని బావ విషయం తెలిసి బాధపడుతూ ఎటు వెళ్ళారో" అన్నాడు విచారంగా.

"పాపం" అంటూ తనూ మనస్ఫూర్తిగా విచారించింది జానకమ్మ.

సుహర్లతకు కూడా మనసులో ఎందుకో బాధనిపించింది.

కొంచెంసేపటికి తిరిగి వచ్చిన ఇద్దరినీ నారాయణరావు, జానకమ్మ సాదరంగా ఆహ్వానించారు. సుహర్లత, ఆరతి ఇప్పుడు బిడియపడలేదు. నవ్వుతూ చూసారు.

"ఏం చేస్తాం నాయనా, మాకుండేది ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరినీ డిగ్రీ వరకు చదివించి పెళ్ళిళ్ళు చేయాలని మా ఉద్దేశ్యం. ఆడవాళ్ళు ఉద్యోగాలకంటే ఇంటిని తీర్చి దిద్దుకోవడం ముఖ్యం అంటారు ఆయన. మా అమ్మాయి సుహర్లత బి.ఏ. పాసై ఇప్పటికి రెండేళ్ళయింది ఎన్నో సంబంధాలు వచ్చిపోయాయి. ఒక్కటీ కుదరలేదు." బాధగా అంది జానకమ్మ.

"ఏమండీ మీరైనా అమ్మకు చెప్పండి. నాకు పెళ్ళికి తొందర లేదని" చొరవ తీసుకుని అంది సుహర్లత.

నరహరి నవ్వాడు. మాధవ్ తలవంచుకొని చేతిగోళ్ళు చూసుకుంటు న్నాడు.

మాధవ్‌కు వచ్చిన ఇంటర్వ్యూ సంగతి విని "చాలా సంతోషం బాబూ. రేపు జాగ్రత్తగా ఇంటర్వ్యూకి ఆటెండుగా" అంటూ కొన్ని సూచన లిచ్చాడు నారాయణరావు.

ఆ రాత్రి తమకు కేటాయించిన గదిలో కూర్చుని లెక్చరర్ ఇంటర్వ్యూకి ప్రిపేరవసాగాడు మాధవ్.

మరుసటి రోజు ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని వచ్చి తన వస్తువులు బాగ్‌లో సర్దుకుంటున్న మాధవ్ దగ్గర కొచ్చింది సుహర్లత.

"ఏమండి ఇంటర్వ్యూలో ఎలా ఫేస్ చేసారు" అంది పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

మాధవ్ కొద్దిగా సిగ్గుపడి "బాగానే చేసానండి కానీ ఇంటర్వ్యూకి చాలామంది హాజరయ్యారు. ఉన్నది ఒకే లెక్చరర్ పోస్టు. ప్రవేటు కాలేజీ కదా నమ్మకం లేదండి."

"అండీ ఏమిటండీ. మీకంటే చిన్నదాన్ని పేరుతో పిలవండి చాలు."

నవ్వి ఊరుకున్నాడు మాధవ్.

"ఇంతకీ కాయంటారా! పండంటారా!"

"కాయనే అంటాను ఇప్పటికి ఎనిమిది ఇంటర్వ్యూ లయ్యాయి.

"నా పెళ్ళి చూపుల్లాగే" నవ్వింది సుహర్లత.

"అంటే!?"

"నావి కూడా ఎనిమిది ఫెయిలయ్యాయి కనుక."

"నిన్న జరిగిన దానికి సారీ అండీ. ఈ విషయంలో నన్ను క్షమిస్తారు గదూ."

"ఏం తప్పు చేసారని మిమ్మల్ని క్షమించాలండీ. రావలసిన వారు రాలేదు. వాళ్ళ కోసం ఎంత శ్రమించి పిండివంటలు చేసారండీ మావాళ్లు? చివరకు వాళ్ళు రాకుండా అవి వేస్టయి ఉండేవి కదా. మీరొచ్చి ఉండక పోతే అవేం కావాలి. క్షమించకూడనిది వాళ్ళనండి."

"ఆవేశపడకండి సుహర్లతగారూ. శుభకార్యం కదా. ఏవో అవాంత రాలు ఉండి రాలేకపోయి ఉంటారు."

"మీరూ వాళ్ళని సమర్థిస్తారా. పోనివ్వండి. నా పెళ్ళిచూపులు, సక్సెస్ కాకపోవడానికి కారణం!"

"ఎన్నో ఉంటాయి పరపతి, డబ్బు."

"డబ్బండీ బాబూ డబ్బు, మనిషిని వెనుక నుంచి నడిపించేది డబ్బు. కాకపోతే సంసారయాత్రలో ఆడదానికి మగవాడు ఎంత అవస రమో, మగవాడికి అంతే గదండీ ఆ మాత్రానికి ఆడదానికే మగాడి అవ

సరం ఉన్నట్లు ఈ డబ్బిచ్చి కొనుక్కోవడమేమిటండీ అసలు పెళ్ళి చేసుకోవడం నా ఇష్టం లేదు. ఏదైనా ఉద్యోగం చేయాలని నా కోరిక. మా తల్లిదండ్రులు వింటేగా" ఆవేశంగా అంది సుహర్లత.

"బాధపడకండి. జీవితంలో ఇలాంటివి మామూలే."

"బాధదేనికండీ. పెళ్ళి కాలేదని నాకు బాధా. పెళ్ళయితేనేనండీ బాబూ మా బాధలు మొదలయ్యేది. భర్త, సంసారము, పిల్లలూ, ఆడ బిడ్డలూ. అత్తమామలు వీళ్ళతో వేగాలి. పెళ్ళయిన వాళ్ళ బాధలు చూస్తూనే ఉన్నాం గదా."

"ఆవేశపడకండి. అన్ని కాపురాలూ అలా ఉండవు."

"అనుభవజ్ఞులు లాగ చెబుతున్నారే. మీకు వివాహమయిందా" పకపకా నవ్వింది.

సిగ్గుపడ్డాడు మాధవ్. "అప్పుడేనా, ఇంకా జీవితంలో స్థిరపడందే" చిన్నగా అన్నాడు.

"ఈ తొమ్మిదవ ఇంటర్వ్యూ సక్సెస్ అవుతుందిలెండి. నా మనసు పదేపదే చెబుతోంది."

"థాంక్సండీ. మీకూ ఈ తొమ్మిదో పెళ్ళి చూపులు సక్సెస్ కావాలని మనసారా కోరుకుంటున్నాను."

"మహానుభావా నా తొమ్మిదో పెళ్ళిచూపులు నీతోనే జరిగాయి. అదే సక్సెసయితే నిన్ను నా గుండెల్లో దాచుకుని పూజించుకుంటాను" మనసులోనే అనుకుంది సుహర్లత.

వీధిలో నుంచి 'మాధవా త్వరగా రా' అన్న నరహరి కేక వినిపించేసరికి మాధవ్ లేచాడు.

"బెస్ట్ ఆఫ్ లక్" అంటూ లేచి వెళ్ళింది సుహర్లత.

'ఎంత అందంగా ఉందిమె. ఎంత మధురంగా మాట్లాడుతుంది' అనుకున్నాడు మాధవ్. అలాంటి చెడ్డ తలంపు వచ్చినందుకు తనను తాను నిందించుకున్నాడు మళ్ళీ.

నరహరి, మాధవ్‌లు వెళ్తూంటే నారాయణరావు కుటుంబ సభ్యులంతా గుమ్మంలోకి వచ్చి వీడ్కోలు చెప్పారు. తన కుమార్తె వివాహానికి తన స్నేహితుడు, అతని కుటుంబం అంతా తప్పక రావాలని కోరాడు. నారాయణరావు ఉద్యోగం విషయంలో తన శక్తి వంచన లేకుండా సహాయం చేయగలనని చెప్పాడు.

సుహర్లతకు మాధవ్‌తో పరిచయం ఒక మధుర స్మృతిలా మిగిలిపోయింది.

• • • •

రామనాథశాస్త్రి ముందుగా చెప్పిన ప్రకారం ఆ రోజు నారాయణరావు ఇంటిముందు ఒక టాక్సీవచ్చి ఆగింది. అందులోంచి ముప్పై ఏళ్ళ యువకుడు శ్యామలరావు, అతని తల్లి, తండ్రి, రామనాథశాస్త్రి దిగారు.

వాళ్ళు దర్జాగా లోపలికి వచ్చి, ఠీవిగా సోఫాల్లో కూర్చున్నారు. శ్యామలరావు తల్లి కామాక్షమ్మ హాలంతా పరిశీలనగా చూస్తోంది. తండ్రి రఘురామయ్య తుండుగుడ్డ భుజం మీంచి జారిపోతుంటే పైపైకి నెట్టుకుంటున్నాడు.

రామనాథశాస్త్రి తన వెనుక తలమీదపిలక లయబద్ధంగా ఊగుతూ ఉంటే పిల్లవాడి గుణగుణాలను వర్ణించి పారేస్తున్నాడు.

"అబ్బాయి రత్నమండీ. సాంప్రదాయకమైన కుటుంబం. చెడ్డ అలవాట్లు లేవు. అమ్మా, నాన్న మాట జవదాటడు. తన పనేమో తనమో

ఈ రోజు ఫీల్డాఫీసరు కొద్ది నెలల్లో డివిజనలు ఆఫీసరు అవుతాడు" శాస్త్రి పొగుడుతున్నంతసేపు కామాక్షమ్మ ఆనందంగా తలూపుతూనే ఉంది.

టిఫిన్ తృప్తిగా తిన్నారు. తరువాత కాఫీలు పట్టుకొచ్చింది సుహర్లత. తెల్లని శరీర ఛాయకు స్నఫ్‌కలర్ చీర, జాకెట్టు ఆమె అందాన్ని రెండింతలు చేసాయి. పొడవైన జడ అందులో వొద్దికగా తురిమిన మల్లె చెండు.

సుహర్లత నడుస్తున్నంతసేపూ తదేకంగా చూస్తూనే ఉంది కామాక్షమ్మ. కాఫీ అందిస్తూ తలెత్తి చూసిన ఆమెను శ్యామలరావు నవ్వుతూ చూసాడు. సుహర్లత సీరియస్‌గా కాఫీ అందించి ఎదురుగ కుర్చీలో కూర్చుంది.

ఇక అమ్మాయి గురించి చెప్పడం మొదలుపెట్టాడు రామనాథ శాస్త్రి. "అమ్మా నేను నారాయణరావుని చిన్నప్పటి నుండి ఎరుగుదును. ఈయన కాలేజీలో మేనేజరు ఉద్యోగం చేస్తున్నారు. నా మాట ఎప్పుడూ జవదాటరు. నిప్పులాంటి వంశం. అమ్మాయిని చూసారుకదా. పద్ధతి తెలిసిన పిల్ల. మీ ఇంట్లోకి అడుగు పెడితే లక్ష్మీదేవి కదలి వచ్చినట్లే" చెప్పుకు పోతున్నాడు. సుహర్లత తల్లిదండ్రులు తృప్తిగా చూస్తుంటే కామాక్షమ్మ మౌనంగా వింటూ కూర్చుంది. శ్యామలరావు సుహర్లతనే అభిమానంగా చూడసాగాడు.

"అమ్మాయి పొడవు ఇంకో రెండంగుళాలు తక్కువ ఉంటే బాగుండేది" అంది కామాక్షమ్మ.

సుహర్లతకు వాళ్ళు తనని ఇంత పరిశీలనగా చూస్తుంటే ఒళ్ళంతా కంపరమెత్తినట్లుగా వుంది.

"అమ్మాయ్ ఎంతవరకు చదివావ్" మళ్ళీ అడిగింది కామాక్షమ్మ.

"బి. ఎ. వరకండీ."

"అంతేకాదండీ అమ్మాయి టైపు హైయ్యరు పాసయింది. కళ్ళు పెద్దవి చేసి చెప్పాడు రామనాథశాస్త్రి.

"సంసారపక్షపు స్త్రీలకు అంతంత చదువులెందుకండి. ఈ టైపు అంటేనే నాకు ఒళ్ళుమంట. ఇక్కడే చాలామంది ఆడపిల్లల్ని వలలో వేసుకుంటారు."

కామాక్షమ్మ మాటలకు సుహర్లత మనసు చివుక్కుమంది. జానకమ్మకు కూడా ఆమె మాటలు ఎబ్బెట్టుగా అనిపించాయి.

మళ్ళీ కామాక్షమ్మ అందుకుంది. "నే చెప్పేది నిజమమ్మా. మా వంశంలో చదువుంటే స్కూలు ఫైనలే. ఆడపిల్లలు పెద్ద మనిషి అయితే బయటకు వెళ్ళేవారు కాదు. ఆ ఆచారాన్ని ఎదిరించి మా బంధువొకాయన తన కూతుర్ని స్కూలు ఫైనల్ కాగానే టైపుకు పంపాడు. అక్కడ ఎవరో ఆ అమ్మాయిని వలలో వేసుకున్నారు. కొన్నాళ్ళకు ఆ అమ్మాయికి ఇంకొకరితో వివాహం నిశ్చయమైంది. దాంతో ఆ అమ్మాయి తను ప్రేమించిన పిల్లాడితో లేచిపోయింది. అందుకేనమ్మా నా అనుమానం."

సుహర్లత గుండెలు మండాయి ఆమె అన్నందుకేగాక శ్యామలరావు తల్లి మాటలకు 'అవునవును' అంటూ వంత పాడినందుకు.

జానకమ్మకెందుకో భయం పుట్టిస్తున్నాయి ఆమె మాటలు. కూతురివైపు చూసింది. కోపాన్ని దాచుకొన్నట్లు ముఖంలోని భావాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

"హ్హా...హ్హా...హ్హా...దాందేముందిలెండి. మా అమ్మాయిని బి.ఏ. చదివించడానికి, టైపు నేర్పడానికి ఇంకో కారణముంది లెండి" నవ్వుతూ సర్దాడు నారాయణరావు. ఆడపిల్లల తండ్రి మరి తను కోప్పడితే ఎలా?

"ఏమిటండీ అది" ఆత్రంగా అడగింది కామాక్షమ్మ. ఆమె భర్తా కుమారుడు సమాధానం కావాలన్నట్లు చూసారు.

వాళ్ళ ఆతృతను, పశు ప్రవర్తననూ చూస్తుంటే ఏడవాలో నవ్వాలో అర్థం కాలేదు సుహర్తకు. వాళ్ళ డాబు, దర్పం చూస్తుంటే అంత ఎత్తున ఉన్నాయి. సంస్కారం చూడబోతే ఇంత హీనంగా ఉందేం అనుకుంది.

"స్వయానా మా బాబాయి కూతురు ఒకామె ఉండేదమ్మా. ఇటీవల ఆమె భర్త ఒక యాక్సిడెంటులో చనిపోయాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు. అతను స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగి. ఆమె చదువు చూడబోతే అయిదు ఫెయిల్. ఉద్యోగమివ్వడానికి అర్హతలు కాకపోవడంతో ఆమెకు ఉద్యోగం రాలేదు. అదే చదువుంటే వెంటనే భర్త స్థానంలో ఆమెకు ఉద్యోగమిచ్చేవాళ్ళు. తన పిల్లల్ని తాను దివ్యంగా పోషించుకునేది"

"అందుకా మీ అమ్మాయిని బాగా చదివించి టైపుకు పంపింది. శుభమా అంటూ పెళ్ళి చూపులకొస్తే ఇటువంటి అప్రాచ్యపు మాటలా శివ! శివా! వాడు ఛస్తే హాయిగా తను మా వాడి కొచ్చే పెన్షను తీసుకుంటూ ఉద్యోగం చేయాలనా" రంకెలు వేయసాగింది కామాక్షమ్మ. నారాయణరావు మాటల్ని మధ్యలోనే అందుకుని. భర్త, కుమారుడు ఆమె వైపు అభిమానంగా చూడసాగారు.

"అరెరె...ఏమిటమ్మా మీరనేది!" కంగారు పడ్డాడు నారాయణరావు ఆ వెనుకనే జానకమ్మకు రామనాథశాస్త్రికి గుండె దడ పుట్టుకొచ్చింది. 'ఏమిటీ విధి వైపరీత్యం' అని.

కామాక్షమ్మ వెనుకనే ఆమె భర్తా, కుమారుడు పైకి లేచారు. వెళ్ళ డానికి ఉద్యుక్తులవుతూ.

"ఆగండి...వెళ్ళేముందు నా మాటా కొద్దిగా వినండి" ఆడ పులిలా గర్జించింది సుహర్లత లేచి నిలబడి బొమ్మల్లా నిలబడి పోయా రంతా.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను. మీరు మనుషులేనా? మీరు నన్ను పొడవన్నారు సన్నగా ఉన్నాన్నారు. ఎందుకు? మీ అబ్బాయి పొట్టిగా, లావుగా వున్నాడనేగా. మీ అబ్బాయికి సరిపడేంతగానే ఎదగాల్నా?

ఏమండీ అబ్బాయిగారూ! తల్లిదండ్రుల మాట జవదాటరని ఎటు వంటి దురలవాట్లు లేవని అన్నారు. గుడ్డిగా, ఛాందసులు, మూర్ఖులు అయిన తల్లిదండ్రుల మాటలు జవదాటకపోవడమూ దురలవాటేనండీ సొసైటీ ఎంత ఫాస్ట్‌గా, ఫార్వర్డ్ అవుతూ ఉంది. దాంతోపాటు సాంఘిక జీవనమూ ఎలా మారుతూ వుంది. స్వంత ఆలోచనలు, స్వంత భావాలు లేకపోవడం ఎంత మూర్ఖత్వం.

నేను వివాహం లేకపోయినా ఉద్యోగం చేసుకుంటూ, నా కాళ్ళ మీద నేను బ్రతకగలననే నమ్మకం వుంది. నేను మీలా తెరచాటు బొమ్మను కాను. చదువుకునేది విజ్ఞానం కోసమేకాక భవిష్యత్తులో హామీ కోసమండీ. అది మీకు ఇంకోలా అనిపించింది.

మరి మీరు ఉద్యోగం ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో ఆఫీసరు. లైఫ్ ఇన్సూరెన్స్ అంటే జీవితభీమా, అంటే మీరు అందరూ చావాలని. అందరూ అనాథలు కావాలనే జీవితభీమా చేయిస్తున్నారో! లేక భవి ష్యత్తులో ఏదయినా జరిగితే రక్షణకోసం చేయిస్తున్నారా. మీకయితే ఒకటి, మాకయితే ఒకటీనా. మీ స్వంత బుర్రతో ఆలోచించండి" పులిలా అరిచింది.

ఎవరూ కిక్కురు మనలేదు. శ్యామలరావు వంచిన తల ఎత్తలేదు.

"నాన్నా! నాకిప్పుడు పూర్తిగా జ్ఞానోదయమైంది. నా శరీరానికే కాదు. మనసుకి వయసొచ్చింది నాన్నా. మిగిలిపోయిన ఒకటీ అరా ఛాందస భావాలు పూర్తిగా కరిగిపోయాయి. నాకు మాధవ్ పూర్తిగా నచ్చాడు. వీలుంటే అతని అభిప్రాయం కనుక్కోండి. అతను సంస్కారి. విజ్ఞాన వంతుడు. మీ కాలేజీ ఇంటర్వ్యూ ఫలితాలు నిష్పక్షపాతంగా జరిగేటట్లు చూసి పుణ్యం కట్టుకోండి" స్థిరంగా చెప్పి వడి-వడిగా లోపలకు నడిచింది.

ఎదురొచ్చిన స్నేహితురాలి భుజంమీద తల వాల్చి వెక్కి--వెక్కి ఏడవసాగింది.

*